# ప్రతిధ్వని

## సింహప్రసాద్

మా ఊరు మరో భోపాల్ కానున్నదంటూ పేపర్లో పడిన వార్త చూసేసరికి నా గుండె గుభేలుమంది.

ప్రాణాంతవేదన బయటపడని పరుగెడుతున్న జనం.

ఎలా వున్నవాళ్ళలా ఒరుసుకుపోతున్న పిల్లలూ, వృద్ధులు

గుట్టలు గుట్టలుగా పడున్న శవాలు.

కళ్ళ ముందెన్నో ఘోర దృశ్యాలు సినిమా రీళ్ళలా కదిలాయి.

వెన్నులోంచి వణుకు పుట్టుకొస్తోంటే చేష్టలు దక్కి కూర్చుండిపోయాను.

ఇంతలో భూనభోంతరాళాలు దద్దరిల్లేలా సెప్టిసైడ్స్ ఫ్యాక్టరీ ఫీంకరించింది.

అదిరిపడి తిన్నగా కూర్చుని కిటికీలోంచి చూశాను.

ఎన్నెన్నో పొగగొట్టాలు ఠీవిగా నిలబడి మాకంటే మా ప్రాణాలు కంటే గొప్ప వాళ్ళమోయ్ అంటున్నాయి.

ఇదివరకు అంటే నిన్నమొన్నటి వరకూ కూడా మా వూరు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నందుకెంతో గర్విస్తూ వస్తున్నాం. కాని ఇవాల్టి పేపర్లో వచ్చి నిజాలు బయట పెట్టే వరకూ చాప కింద నీరులా ప్రవహిస్తున్న ప్రమాదాన్ని పసిగట్టలేకపోయాం.

సెప్టిసైడ్స్ కార్పొరేషన్, కెమికల్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ డిస్టిలరీ, పొగాకు కంపెనీలు ఇవన్నీ విషధూళి వాయువులు వెదజల్లుతూ మా ఆరోగ్యాన్ని హరిస్తున్నాయట! వాటివల్ల బ్రాంకైటిస్, క్షయ మొదలగు వ్యాధులు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయట. అంతేకాకుండా సాగుభూమిని సేద్యానికి పనికిరాకుండా చేస్తున్నాయట. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి వాళ్ళేమీ చర్యలు తీసుకోకపోగా ఫ్యాక్టరీల నుంచి వచ్చే కలుషిత నీటిద్వారా దోమలు వ్యాప్తి చెంది మలేరియా ఫైలేరియాలాంటి రోగాలొస్తున్నాయట!

అప్పుడూ ఆ విషవాయువు మా బాబిగాడ్ని..

"ఒరే బాబిగా" అరిచాను.

వచ్చేడు. ఎదురొమ్ములు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్య మధ్య దగ్గుతున్నాడు కూడా. ఒంటిమీద చొక్కా లేని బాబిగాడు గత రెండేళ్ళ నుండి ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఏవో మందులు వాడుతున్నా సరైన గుణం కన్పించడంలేదేమిటా అనుకుంటున్నాను. దానికి కారణం వాతావరణ కాలుష్యమన్నమాట!

మైగాడ్! సాయంత్రం డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళి తన అనుమానం గురించి చెప్పి సరైన పరీక్షలు చెయ్యమని చెప్పాలి. పేపర్లోని వార్త చూసేకైనా ప్రభుత్వం నిద్రలేచి కాలుష్య నివారణగ్గాను సత్వరం చర్యలు తీసుకుంటే బాగుణ్ణు...

"ఏమిటండి ఇంకా అలా నిమ్మకి నీరెత్తినట్టు కూర్చున్నారు. ఆఫీసుకు టైమవటంలేదూ?" శ్రీమతి కేకపెట్టింది వంటింట్లోంచి.

"ఆఫీసెక్కడికీ పోదుగాని నువ్విలా ఓసారి రా.."

"అబ్బ ఇప్పుడేం పనొచ్చి పడిందండీ అవతల పులుసు ఇగిరిపోతోంది..."

"ఇవతల ప్రాణాలు పోతోంటే పులుసు గొడవేంటే"

"ప్రాణాలా? ఏమిటండీ ఏమయ్యింది?" ఆందోళనగా అడిగింది.

"ఇదిగో పేపరు చూడు.." అంటూ చూపించి అంతా వివరించాను.

"హమ్మయ్య! దీనిగురించేనా నా కొంపలు మునిగిపోతున్నట్టు అంత హడలగొట్టేరూ. పని లేని మంగలేదో చేసినట్టు పేపరోళ్ళు ఏదో రాస్తుంటారు. అవన్నీ పట్టించుకుంటే అయినట్టే. అయినా ఆ లెక్కన చూసుకుంటే హైదరాబాదు ఈ పాటికి మసైపోవద్దూ?"

"అబ్బా. నీకు చెబితే అర్థం కాదేమిటే. ఇక్కడ విషపుమందులు తయారు చేసే ఫ్యాక్టరీ వున్నందున కాలుష్య నివారణకి సరైన చర్యలు తీసుకోనందునా పరిస్థితి ఆందోళనకరంగా పరిణమిస్తోందంటే నమ్మించుకోవేం?" కొంచెం కోపంగానే అన్నాను.

"ఏమో బాబు నాకేం తెలీదుగాని అవతల పులుసు..." అంటూ వెళ్ళిపోయింది చేతులు తిప్పుకుంటూ

"ఏమిట్రా పొద్దున్నే దానిమీద విసుక్కుంటున్నావూ.." అంది మా అమ్మ హాల్లోకొస్తూ

ఓపిగ్గా అంతా వివరించి చెప్పాను.

బుగ్గలు నొక్కుకుందావిడ. "అలాగట్రా చా చా ఎంత ఘోరం! అయినా అందుకే అన్నార్రా కలికాలం అని. పాపం పెరిగిపోయింది మరి. భూదేవి భారం తగ్గించుకోవద్దూ. నువ్విప్పుడేదో కొత్తగా చెబుతున్నావు గానీ వీరబ్రహ్మం గారెప్పుడో చెప్పేర్రా. అవునుగాని ఒరే అబ్బాయి. వీరబ్రహ్మంగారి సినిమా మనూరెప్పుడొస్తుందిరా?"

"ఎప్పుడో అప్పుడు వచ్చి ఛస్తుందిలే" విసుగ్గా అని విసురుగా లేచాను.

ఆఫీసులో అడుగుపెడుతూనే అందర్నీ తేరిపార చూశాను.

వూహూ. ఏమీ మార్పులేదు. ఏమిటి వీళ్ళంతా నిశ్చింతగా వున్నారు. వీళ్ళెవరూ ఇవాల్టి పేపరు చూడలేదా!

"రావోయ్ రంగా. ఏమీ అనుకోకుండా ఒక సిగరెట్టిస్తావూ" ఋడిసి అరువు అప్పారావు అడిగాడు. అరువు అతడి ఇంటి పేరుకాదు. ప్రవృత్తి పేరు.

"ఇస్తాంగానీ ఇవాల్టి పేపరు చూసావా?"

"చూడక పోవడమేమిటి! మా ప్రక్కింటి వారి పేపరుకి ప్రథమ రీడర్ని నేనేనోయ్. ప్రొద్దుటే లేచి పేపర్ కుర్రాడికోసం వీధిలో తిష్ఠవేస్తానంటేనమ్ము.." గొప్పగా అన్నాడు.

"మొదటిపేజీలో..."

"గుర్తు చెయ్యక్కర్లేదోయ్. మనకంతా కంఠతమే. చెప్పనా! అహ్మదాబాద్‌కి మరికొంత సైన్యం. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు తాత్కాలిక సహాయం. మే 14న సమ్మెకు పిలుపు, బొంబాయి శివసేనా కైవసం, అబ్కారీ ఆదాయం 400 కోట్లు, ఇంకా... ఎన్ కౌంటర్లు సమర్థనీయమంటూ హోంమంత్రి ప్రకటన..."

"అదికాదోయ్ మనవూరింకో భోపాల్ అవుతుందేమోనంటూ వచ్చిన వార్త సంగతి"

"అవును అదీవుందోయ్ అన్నట్టు భోపాల్ బాధితులకి 50 లక్షల డాలర్లిస్తా మంటున్నారోయ్. అంటే అయిదుకోట్లు. ఒక్కో కుటుంబానికీ ఎంత వస్తుందంటావ్? ఒకరకంగా వాళ్ళు చాలా అదృష్టవంతులోయ్..."

వెర్రిగా చూశాను. ఇంకాసేపుంటే అలాంటి ఘోరం మనూళ్ళో కూడా జరిగితే బావుణ్ణనేట్టున్నాడన్పించి లేచి పక్కకొచ్చాను.

ఆ వార్త గుండెల్ని తొలిచేస్తోంటే సీట్లో తిన్నగా కూర్చోలేక ఇంకో సెక్షన్‌కెళ్ళాను. అక్కడ కొందరు సహోద్యోగుల మధ్య తీవ్రమైన చర్చ జరుగుతోంది. బహుశా వాతావరణ కాలుష్యం గురించే ననుకొని అటు నడిచాను గబగబా.

"అదంతా వట్టి గాసిప్ గురూ. యన్టీఆర్ శవపూజ ఎందుకు చేస్తాడసలు. అసలు రోజూ శవాలెక్కడ దొరుకుతాయి?"

"అది నాకు తెలీదుగానీ ఎలాగైనా ప్రధానినైపోవాలన్న కోరిక ప్రబలంగా వుంది. సన్యాసి వేషం వేసినా చెవిపోగులు ధరించినా చీరకట్టినా శవపూజ చేసినా ఆఖరికి హిందూపూర్‌ని వుంచుకున్నా అన్నీ దాని గురించేనన్నది పచ్చి నిజం"

**మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. పేపర్లోని వార్తగురించి చెప్పి భోపాల్ దుర్ఘటన నేపథ్యంలో మనవూరి పరిస్థితుల నాధారంగా కథ రాయండి. వాస్తవ సంఘటన గనుక బాగా క్లిక్ అవుతుంది అన్నాను.**

"అదిగో పులి అంటే ఇదిగో తోక అంటారు. అవన్నీ పట్టుకుని వ్రేలాడితే ఎలాగా! అయినా అతగాడికి మంత్రతంత్ర గజకర్ణ గోకర్ణ టక్కు టమార విద్యల్లో నమ్మకం ఉందనుకో. అది అతగాడి వ్యక్తిగతం. మనకెందుకు చెప్పు? అతడెలా పరిపాలిస్తున్నాడన్నది మనక్కావాలిగాని అతడి సెంటిమెంట్సూ నమ్మకాలు మనకనవసరం.."

"సెక్యులర్ వ్యవస్థలో అలాటి మూఢనమ్మకాలున్న వాడి పాలనని పొగట్టం నీకే చెల్లింది"

"ఓడిపోయిన వుక్రోషం కొద్దీ ఆడిపోసుకోవడం మీకే చెల్లింది"

మాటామాటా పెరుగుతోంది. చేతులు కలుపుకోక పోవచ్చుగాని ఎందుకొచ్చిన రగడ ఇదంతా? విషపూరిత మవుతోన్న వాతావరణాన్ని ప్రభుత్వం అరికట్టడం లేదంటూ విమర్శించడం పోయి... ఛా ఛ... ఏం జనం!

సీట్లో కూర్చుని ఫైలు విప్పేను.

మలో భోపాల్ కానున్న...




వూహూ. లాభంలేదు. బుర్ర పాడైపోయింది. ఏవో కొన్ని సాంత్వన వాక్యాలు వినేదాకా శాంతి వుండదు.

ఓ బ్యాంకులో పనిచేస్తోన్న మిత్రుడికి ఫోన్ చేద్దామని టెలిఫోన్ ఆపరేటర్ దగ్గరికెళ్ళాను.

ఆవిడా టైపిస్టు విమలారామం సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. విమలారామం వ్యక్తిత్వం మీదా ఆలోచనా ధోరణి మీదా నాకు మంచి అభిప్రాయం వుంది. బహుశా నాలానే పేపర్ వార్తకి ఆందోళన పడుతున్నారనుకొని ఓ చెవి అటు పారేసాను. కొత్తగా ప్రారంభించబడ్డ చీరల షోరూమ్‌లో ధరలు వాయించ్ చేస్తున్నారంటూ వుదాహరణ పూర్వకంగా చెప్పుకుంటూ బాధపడి పోతున్నారు వాళ్ళు!

వాళ్ళ మాటలకడ్డొచ్చి బ్యాంక్‌కి రింగ్ చేయించాను.

"కంగ్రాట్యులేషన్స్‌రా రంగా"

"ఎందుకురా?"

"ఎందుకేమిట్రా ఫూల్. కేంద్ర ప్రభుత్వోద్యోగులకి ఒక డిఏ ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చారు. సో మీకు ఇచ్చేస్తారు కదా. అన్నట్టు మీక్కూడా తాత్కాలిక సహాయం ఇస్తుందా స్టేట్ గవర్నమెంటు? ఇస్తే అదీ ఇదీ కలిపి ఏకెంత బెనిఫిట్ వుంటుందిరా! ఏంతైనా అదృష్టవంతుల్రా. పని తక్కువ. బాధ్యత తక్కువ. మాలాగే జీతం పుచ్చేసుకుంటున్నారు"

"జీతాలు సంగతలా వుంచి జీవితాల సంగతాలోచించరా ముందరా"

"వాడ్డాయూమీన్"

"రగులుతోన్న రాక్షసి బొగ్గురా" అంటూ వివరించాను.

"అదా వంపేప్ ఫో. భారీ పరిశ్రమలవల్ల వాతావరణం పాడైపోతుందని చిన్నప్పుడు చదువుకున్నాం. ఇన్నేళ్ళలో ఏం జరిగాయి ఒక్క భోపాల్ ఘటన తప్ప."

"కన్పించకుండా జరుగుతోన్న హాని సంగతి మర్చిపోతే ఎలారా? ప్రభుత్వం వెంటనే తగిన చర్య తీసుకోదంటావా?"

"తీసుకోదు. ఎంచేతంటే ఒక ఫ్యాక్టరీ యమ్మెల్యేగారిది. ఇంకో ఫ్యాక్టరీ ఓ మంత్రిగారికి వాటా వుందని విన్నాను. మిగతావన్నీ పెద్దపెద్దవాళ్ళవే. వాళ్ళంతా అధికారపక్షానికి సన్నిహితంగా వుంటారుకదా"

"అంతేనంటావా?"

"అంతేకాని సాయంత్రం ఏమైనా ప్రోగ్రాం వేసుకుందామా?"

"సారీరా. మూడ్ బాగోలేదు" రిసీవర్ పెట్టేసి

ప్రస్పురంటూ విట్టూర్చాను.

"హమ్మయ్యా ఇక్కడున్నారా. ఇందాకట్నుంచి మీ గురించి ఒకటే వెదుకుతున్నానంటే మీరు నమ్మాలి" అన్నాడు కవిశ్రీ.

"దేనికండీ"

"అర్జంటు పనంటే మీరు నమ్మాలి. ఇక్కడ చెప్పకూడదు గాని కేంటీన్ కెళ్దాం పదండి"

కేంటీన్‌కి లాక్కెళ్ళి టీ ఇప్పించి వక్క ఆఫర్‌చేస్తూ అన్నారు "ఇప్పుడో పెద్ద చిక్కొచ్చి పడిందంటే మీరు నమ్మాలి. హెల్ప్ చెయ్యాలి. ఏం లేదండి. ఓ పత్రిక వాళ్ళు కథలపోటీ పెట్టారంటే మీరు నమ్మాలి. ఇంకా వారంరోజులే వుంది గడువు. ఇంగ్లీషు నవలలు మీరు తెగచదివి పారేస్తుంటారు గనుక అందులోని ఓ మంచి పాయింటో ఓ గొప్ప సంఘటనో చెప్పి పుణ్యం కట్టుకోవాలి"

"కాపీ అంటారేమో.."

"ఎవడు అలా కూసేది? మన తెలుగు నవలలన్నీ ఇంగ్లీషు నవలలకి కాపీలే అంటే మీరు నమ్మాలి. ఆ బాధలేవో నేను పడతాను కానీ బాబ్బాబు చక్కని ప్లాట్ చెప్పి ఈ గండం గట్టెక్కించండి."

మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. పేపర్లోని వార్త గురించి చెప్పి "భోపాల్ దుర్ఘటన నేపథ్యంలో మన వూరి పరిస్థితుల నాధారంగా కథ రాయండి. వాస్తవ సంఘటన గనుక బాగా క్లిక్ అవుతుంది" అన్నాను.

అతని మొహం అప్రసన్నంగా మారింది.

"ప్చ్. అలాటివి ఎడిటర్లకి నచ్చవంటే మీరు నమ్మాలి. పాఠకులు ముందే చదవరండీ బాబూ. పోటీకి గనుక ప్రైజు వచ్చే థీమ్ వుండి తీరాలంటే మీరు నమ్మాలి. ధనికుల దౌర్జన్యాలో, పేదల అగచాట్లో, ఆడవాళ్ళ కన్నీళ్ళో ఏదోటి కొంచెం సెంటిమెంట్‌తో వుంటే..."

"సారీ నాకేం తట్టడంలేదు" ఇంకో ముక్క మాట్లాడటం కూడా ఇష్టం లేకపోయింది.

సాయంత్రం ఆఫీసయ్యాక ఆనంద్‌గాడి మెడికల్ షాపుకెళ్ళాను. వాడికి మెడికల్ ఫీల్డ్ గురించి పరిచయం వుంది గనుక పేపర్ వార్తకి బాగా రియాక్టయి వుంటాడని నా అంచనా..

నేవెళ్ళేసరికి రెండు సినిమా పత్రికలు ముందేసుకుని చూస్తున్నాడు. వాడి సినిమా పిచ్చి గురించి వూరందరికీ తెలుసు. రెండు మూడుసార్లు మద్రాసు వెళ్ళి సినిమాల్లో నటించడానికి ప్రయత్నించడమే కాదు ఓ సినిమాలో గుంపులో గోవిందాగా క్షణం సేపు నటించాడు కూడా.

"రారా ఏవిటి బొత్తిగా అవుటాప్ ఫోకస్ అయిపోయావు."

"ఏమీలేదు కానీ ఏమిటంత దీక్షగా చూస్తున్నావు"

"త్రీడీల యుగం అయిపోయింది కదురా. త్రీడీలో సిల్క్ స్మిత డేన్స్ ఎంత థ్రిల్లింగ్ వుంటుందోదని ఆలోచిస్తున్నాను."

"సరిపోయిందిగాని పేపర్ చూశావా. ప్రొద్దుట్నుంచీ ఇవే పట్టుకూర్చున్నావా"

"చూశాన్రా. 'ముచ్చటగా ముగ్గురు' సినిమా కొన్ని ప్రాంతాలకింకా అమ్ముడవ లేదనుకుంటూరా. బిజినెస్ వ్యవహారాలకి సంప్రదించమంటూ ప్రకటించారు. ఎవరైనా ఇద్దరు ముగ్గురు కలిస్తే బావుద్నురా. మన ప్రాంతానికి కొనొచ్చు. కామెడీ పిక్చర్ గనుక బాగా పోతుందిరా. నీకు తెలుసున్నవాళ్ళ కెవరికైనా ఇంటరెస్ట్ వుంటే చెప్పరా"

"అలాగే వస్తాన్రా"

"కూర్చోరా వెళ్దువుగానీ"

"పనుందిరా"

ఇక వీళ్ళవల్ల లాభం లేదనిపించి తిన్నగా మావార్డు కౌన్సిలర్ ఇంటికెళ్ళాను. అదృష్టవశాత్తూ ఆయన ఇంట్లోనే వుండటంతో నా ఆలోచనని బయటపెట్టాను.

"మీ ఆలోచనలో అర్థం లేకపోలేదు మాస్టారూ. కాని ఇంతవరకూ వాతావరణం కాలుష్యమవకుండా చర్యలు తీసుకోక పోవడంలో మునిసిపాలిటీ పాత్ర కూడా వుంది. ఇప్పుడు మనం బయటపడి గొడవచేస్తే దాన్ని ప్రతిష్టం అయిసుగా తీసుకుంటుంది. ఇక్కడి అధికారపార్టీ మా మిత్రపక్షం కనుక మేం వేధిక్కడం కుదరదు బాబోయ్. అయినా చైర్మన్‌తోనూ కమీషనర్‌తోనూ హెల్త్ ఇన్స్పెక్టర్‌తోనూ ఈ విషయం గురించి తప్పకుండా చర్చిస్తాను మాస్టారు"

హు! ఇందులో కూడా రాజకీయాలే!

గిరుక్కున వెనుదిరిగాను.

ఛా ఛా ఏం జనం! దేశం తగలబడిపోతున్నా పట్టించుకోని జనం. నా చిన్న బొజ్జకు శ్రీరామరక్ష అనుకునే జనం! జనం ఇలాంటి స్వార్థంతో బాధ్యతా రాహిత్యంతో కుళ్ళిపోతుంటే దేశమేమై పోతుంది.

"ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా.." సినిమా బండిలోంచి ఘంటసాల గొంతుతో శ్రీ శ్రీ హెచ్చరిస్తున్నాడు.

కొరడాతో ఛెళ్ళున కొట్టినట్టనిపించింది.

అవున్నిజమే. ఎవరో వచ్చి ప్రశ్ని తలకెత్తుతారని ఎదురుచూస్తూ కూర్చోవడమంత తెలివితక్కువ తనమింకోటి లేదు. పరివాళ్ళు నాకెందుకులే ఎవళ్ళో చేస్తార్లే అనుకుంటే దేశమెలా బాగుపడుతుంది.

ఎవరికి వాళ్ళు నడుంకట్టి ముందడుగు వెయ్యాల్సిన సమయం ఆసన్నమయింది.

వూరి వాతావరణం మరింత విషపూరితం కాకుండా సత్వరమే చర్యలు తీసుకోమని ఇటు ఫ్యాక్టరీ వారిని అటు ప్రభుత్వాన్ని కోరుతూ తొలికేక వేస్తాను! ఇంతవరకూ నిర్లక్ష్యం చేసినందుకు ఒంటరిగానే నిరసన తెలియజేస్తాను.

రేపు నాతోబాటు మరిన్ని కంఠాలు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చెయ్యొచ్చు.

రేపు ఎందరెందరో వచ్చి ఈ నిరసనోద్యమాన్ని మహాప్రవంతిగా మార్చొచ్చు!

అప్పుడు ప్రభుత్వం కుంభకర్ణ నిద్రవదిలి కాలుష్య నివారణకి పెద్దఎత్తున చర్యలు తీసుకోకతప్పదు.

వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా మొదలయ్యేది మొదటి అడుగుతోనే.

ఒక నిశ్చయానికొచ్చేకగాని నా గుండెలు కుదుటపడలేదు.

కళ్ళముందు రేపటి దృశ్యం మెదిలింది.

ఫ్యాక్టరీల ముందు గుడారాలు వేసుకుని నినాదాల బేనర్లు తగిలించి తమ నిరసనని తెలుపుతూ సత్వర చర్యలు తీసుకోమని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారెందరెందరో కార్మికులు, కర్షకులు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులూనూ!

(అంకితం: ఇటీవల కూకట్‌పల్లిలో వాతావరణ కాలుష్య నివారణకి చర్యలు తీసుకోమని కోరుతూ తీసిన ఊరేగింపుకి నాయకత్వం వహించిన ప్రఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మ, కుటుంబరావు గాంధీ తదితరులంతా ఆ ఊరేగింపులో పాల్గొన్న ప్రజానీకానికి ఈ చిన్న కథ అంకితం.) *



విసిరింది

"ఏ తలకా దెబ్బలేమిటోయ్!" అడిగాడు ప్రసాద్, ప్రవీణ్‌ని.

"మా ప్రేయసి పువ్వు విసిరిందిలే..." చెప్పాడు ప్రవీణ్.

"పువ్వు విసిరితే అంత దెబ్బలా తగిలింది?"

"నేనంటే ప్రేమ ఎక్కువ లే... కుండీతో సహా విసిరింది..."

కలిమిశ్రీ (కొత్తరెడ్డిపాలెం)

